క్లుప్తంగా

రెగ్యులేటర్ల పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: పురుషోత్తపట్నం వద్దగల తొర్రి గడ్డ పంపింగ్ స్కీమ్ కాలువలపై రెగ్యులేటర్ల పునర్నిర్మాణానికి స్కీమ్ ప్రాజెక్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్, నాయకుడు చల్లమళ్ల సుజీరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. టీపీ స్కీమ్ కుడి, ఎడమ కాలువలకు రామచంద్రపురం వద్ద రెండు రెగ్యులేటర్లను తొలగించి పునర్నిర్మించనున్నారు. జైకా నిధులతో (జపాన్ ఇంటర్నేషనల్ కోపరేటివ్ ఏజెన్సీ) ఈ పనులు జరుగుతాయి. కార్యక్రమంలో గద్దె వీరన్నబాబు, ముదునూరి రామకృష్ణరాజు, కూచిపూడి నాగేశ్వరరావు, మద్దాల కొండలరావు పాల్గొన్నారు.

త్రిముఖలింగేశ్వరునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో త్రిముఖలింగేశ్వరస్వామి

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని బుడిత మామిడి వద్ద కొలువైన బాల త్రిపుర సుందరి సమేత త్రిముఖలింగేశ్వరస్వామిని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు భాస్కర్ శర్మ, శ్రీనివాసశర్మ, విశ్వపతి, కృష్ణాచైతన్య, ఆధ్వర్యంలో పండ్ల రసాలతో అభిషేకాలు చేసి అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు.

మహతి విద్యార్థులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న నాగసూర్యహర్ష

సీతానగరం: సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డ్ ఒలింపియాడ్ పరీక్షలో కాటవరం శ్రీమహతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు కోమలి వోజంత రాజ్ (10వ తరగతి), కొల్లి నాగ సూర్యహర్ష (9వ తరగతి), చిక్కా గోవర్ధన్ స్వామి (4వ తరగతి) ప్రతిభ చూపారు. రాష్ట్రస్థాయిలో నాలుగు, జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ ఎ.శ్రీనివాస్, ఐఐటీ అకడమిక్ డైరెక్టర్ ఏఎస్ రాంప్రసాద్ బుధవారం తెలిపారు. హైదరాబాద్ రవీంద్ర భారతి ఈ నెల 16న జరిగిన కార్యక్రమంలో సినీనటుడు అడవి శేషు, చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారన్నారు.

ఘనంగా లైలతుల్ ఖద్ర్

బిక్కవోలు: ముస్లింల పవిత్ర రాత్రి లైలతుల్ ఖద్ర్ పండగను మంగళవారం రాత్రి మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసంలో వచ్చే అత్యంత ప్రత్యేకమైన రాత్రిని పురస్కరించుకొని పందలపాక గ్రామంలోని మసీదులను వివిధ రకాలు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లైలతుల్ ఖద్ర్‌ను పురస్కరించుకొని ఆలింగనం చేసుకుని, ముసాఫా ఇచ్చుకుంటూ ఒకరి కొకరి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మసీదు గురువు మౌలానా షేక్ గులాం గౌస్ రిజ్వీ ఆధ్వర్యంలో తెల్లవారుజాము వరకూ ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాయి. బిక్కవోలు, బలభద్రపురం గ్రామంలోని మసీదులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని చినకొండేపూడికి చెందిన దొంగ ప్రసాద్ (30) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు బుధవారం తెలిపారు. అతడి భార్యాపిల్లలు ఆరు నెలల క్రితం అతడికి వదిలివెళ్లడంతో ఒంటరితనం భరించలేక ఈనెల 16 పురుగుమందు తాగాడు. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్సకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతిచెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

23న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

గోకవరం: వీరలంకపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎంయూవీ రాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టిక్కెట్, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఏటిగట్టుకు రక్షణ కరువు

- బొరియలతో ప్రమాదం
- బలహీనంగా మారిన వైనం



సీతానగరం వద్ద ఏటిగట్టుపై ఏర్పడిన బొరియ

సీతానగరం: అఖండ గోదావరి వరద నుంచి కాపాడే ఏటిగట్టుకు బొరియలు పడి ప్రమాదకరంగా మారాయి. సీతానగరం నుంచి బొబ్బిల్లంక వరకూ ఏటిగట్టుకు పదేళ్ల క్రితం సుమారు 30 వరకూ బొరియలు పడ్డాయి. వీటివల్ల గోదావరి వరద సమయంలో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పదేళ్ల క్రితం గోదావరి వరదతో ఏటిగట్టు జారిపోయి బలహీనంగా ఉన్న ప్రదేశాలలో ఇరిగేషన్, అఖండ గోదావరి లెఫ్ట్‌బ్యాంక్ అధికారులు ఇసుక బస్తాలు వేసి వదిలేశారు. మునికూడలి వద్ద ఏటిగట్టు బలహీన పడిందని పదేళ్ల క్రితం ధవళేశ్వరం నుంచి కూలీలను తీసుకు వచ్చి ఇసుక బస్తాలను ఏటిగట్టు అంచున వేసి వదిలేశారు. సీతానగరంలోని లంకూరు వద్ద కూడా ఇలాగే చేశారు. ఆ తర్వాత ఏటిగట్టును పట్టించుకున్న దాఖలాలు లేవు.

బిక్కుబిక్కుమంటూ..

గోదావరి వరద సమయంలో ఏటిగట్టును ఆనుకొని ఉన్న పురుషోత్తపట్నం, వంగలపూడి, రామచంద్రపురం, సింగవరం, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనగంటివారిపేట, వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. గతంలో ఏజీఎల్‌బీ అధికారులు సీతానగరం, మునికూడలి వద్ద ఇసుక బస్తాలు వేసిన ప్రాంతంలో ఎటువంటి పటిష్టమైన చర్యలు తీసుకోలేదు. మళ్లీ వరద వస్తే అక్కడ ఏప్రమాదం జరుగుతుందోనని మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అయితే సీతానగరంలో గోదావరి వైపున ఉన్న మట్టిని కొందరు వ్యాపారులు తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అరకొర దాడులతో అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ట్రక్కుమట్టిని రూ. వెయ్యికి విక్రయిస్తున్నారు. సీతానగరం, మునికూడలి వద్ద ఇసుక బస్తాలు వేసిన ప్రాంతంలో ఏటిగట్టును పటిష్టపర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వరదొస్తే ప్రమాదమే



గోదావరి వరద ఉధృతంగా వస్తే ఏటిగట్టుకు ప్రమాదమే. సీతానగరం, మునికూడలి, జాలిమూడి గ్రామాల వద్ద గట్టు జారిపోయి ఉంది. పదేళ్ల క్రితం ఇక్కడ ఇసుక బస్తాలు వేసి వదిలేశారు. ఇప్పటి వరకూ పటిష్టతకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇరిగేషన్ శాఖ దీనిపై దృష్టి సారించాలి.
– సాంబేలపు బాలయోగి, రఘుదేవపురం

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



అగ్నిమాపక సిబ్బందితో చర్చిస్తున్న డాక్టర్ రామగుర్రెడ్డి, ఆసుపత్రి వైద్యులు

అనపర్తి: అప్రమత్తత, అవగాహనతోనే అగ్నిప్రమాదాలను నివారించగలమని స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ టి.రామగుర్రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం అనపర్తి అగ్నిమాపక సిబ్బంది స్థానిక ఏరియా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిప్రమాదాలు, నివారణ చర్యలపై ప్రజలను చైతన్య పరిచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పవర్ టిల్లర్ల పంపిణీ



రైతులకు పవర్ ట్రిల్లర్లను అందజేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి, తదితరులు

అనపర్తి: రామవరం రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం రైతులకు పవర్ టిల్లర్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా మంజూరైన ఈ యంత్రాలను గ్రామానికి చెందిన రైతులకు అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతే రాజని ప్రభుత్వం నిరూపిస్తోందని, అన్నదాతల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గిరడా గంగాభవాని, ఎంపీటీసీలు గొలుగూరి గౌతమి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయాధికారి సురేష్‌కుమార్, డీసీసీబీ కోఆపరేటివ్ బ్యాంక్ సూపర్‌వైజర్ జి.రామారావు, వ్యవసాయ సహాయకుడు చణస్త్రస్, వైఎస్సార్‌సీపీ పాల్గొన్నారు.

పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



అచ్చుతాపురత్రయంలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి. చిత్రంలో పెదపూడి, బిక్కవోలు, అనపర్తి జెడ్పీటీసీ సభ్యులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అచ్చుతాపురత్రయంలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: పేదరికమే ప్రామాణికంగా తీసుకుని అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, మళ్లీ ఆయన అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అచ్చుతాపురత్రయంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, పెదపూడి, బిక్కవోలు, అనపర్తి మండలాల జెడ్పీటీసీ సభ్యులు పేపకాలయ వెంకటలక్ష్మి, రొంగల పద్మావతి, సత్తి గీతా వరలక్ష్మి, సర్పంచి అడబాల అనురాధ, ఎంపీటీసీ సభ్యురాలు పెండెం జ్ఞాన ప్రసూన, స్థానిక సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు, కర్రి సత్యనారాయణ, పార్టీ గ్రామ కన్వీనర్ పి.వీరన్న, కాకర పల్లి సుందరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌పై అవగాహన అవసరం

- డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరావు
- వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం

కంబాలచెరువు: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌పై వైద్యాధికారులు, సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన అవసరమని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు, సూపర్ వైజర్లకు గురువారం ఆనం కళా కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి గర్భిణికి పరీక్షలు పరీక్షలు నిర్వహించాలని, ప్రసవ తేదీకి అనుగుణంగా వారం రోజుల ముందుగానే హాస్పిటల్లో చేరేలా ఏర్పాట్లు చేయాలన్నారు. డీఎల్‌టీవో డాక్టర్ ఎన్.వసుంధర మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, అన్ని సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు, విలేజ్ హెల్త్ కమిటీలను ప్రతి సమావేశంలోనూ వీటిపై మాట్లాడాలన్నారు. జిల్లా మలేరియా అధికారి జి.వీర్రాజు మాట్లాడుతూ ప్రతివారు శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఏఎస్ఎం హెల్త్ యాప్‌లో లాగిన్ అయ్యి ఫొటోలు పెట్టి క్లియర్ చేయాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ కోవిడ్ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యం చేయించుకోవాలన్నారు. సమావేశంలో కొవ్వూరు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జి.వరలక్ష్మి, పీహెచ్‌వో నాగు, డాక్టర్ సుధీర్, డాక్టర్ సూర్య పాల్గొన్నారు.

బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచార భేరి

ప్రకాశం నగర్: బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ, సీపీఎం ఆల్ ఇండియా కమిటీల పిలుపు మేరకు ప్రజాపోరు యాత్రలో భాగంగా చేపట్టిన ప్రచార భేరి బుధవారం స్థానిక క్వారీ సెంటర్ నుంచి సుబ్బారావు నగర్, సారంగధరమెట్ట వరకు జరిగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలను పెంచుతూ పేద, మధ్యతరగతి జీవితాలను దుర్భరం చేస్తోందన్నారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతోందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, నల్ల రామారావు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ..

రాజానగరం: మండలంలోని ఫరిజల్లిపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం రెండో రోజు కార్యక్రమం గురువారం ఉదయం 11 గంటల నుంచి జరుగనుంది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొంటారని ఆ పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద తెలిపారు.

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

మధురపూడి: పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోటికేశవరం పీహెచ్‌సీ డాక్టర్ పుణ్యశాంతి, దోసకాయలపల్లి పీహెచ్‌సీ డాక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రోజుకు కనీసం 15 గ్లాసులు నీరు తీసుకోవాలని, రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ అధికంగా తాగాలన్నారు. బయటకు వెళ్లినప్పుడు గొడుగు ఉపయోగించాలని, టోపీ ధరించాలన్నారు. మాంసాహారం తగ్గించి, తాజా కూరగాయలను ఆహారంగా తీసుకోవాలన్నారు.

వృద్ధురాలికి వైద్యపరీక్షలు

మధురపూడి: గ్రామంలోని ఓ వృద్ధురాలికి కరోనా సోకిందన్న విషయంపై బుధవారం వైద్య పరీక్షలు చేయగా నెగెటివ్ వచ్చినట్లు కోరుకొండ పీహెచ్‌సీ డాక్టర్ రవిచంద్ర తెలిపారు. ఆమె ఇటీవల జలుబు, జ్వరంతో బాధపడుతూ రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు హాస్పటల్‌కు వెళ్లింది. అక్కడి వైద్యులు ఆమెకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారించారు. సంబంధిత వైద్య సిబ్బంది, పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చారు. క్వారంటైన్‌లో ఉన్న ఆమెకు బుధవారం వైద్య పరీక్షలు జరపగా నెగెటివ్‌గా నిర్ధారణ అయ్యిందన్నారు.

900 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు



శ్రీరంగపట్నంలో ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యవసాయశాఖ, ఆర్‌బీకే సిబ్బంది

మధురపూడి: కోరుకొండ మండలంలో ధాన్యం కొనుగోలు చురుగ్గా సాగుతోంది. రబీ సీజన్‌లో ఆర్ ఎస్ఆర్, 1121 రకాలను మండల రైతులు సాగు చేశారు. ఇప్పటి వరకూ 900 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ప్రభుత్వం మంచి మద్దతు ధర ప్రకటించి, 100 కేజీల (క్వింటాల్)కు రూ.2,040 ఇస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కోరుకొండ మండలంలో 17 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఆరింటిని వ్యవసాయ శాఖ ఏడీ మల్లికార్జునరావు, ఆరింటిని తహసీల్దార్ పాపారావు, మరో ఐదు కేంద్రాలను ఎంపీడీఓ పీఏస్ నరేష్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదె

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం పుష్కర కాలువలోకి తాగునీటి కోసం దిగిన పాడిగేదె విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. వివరాల్లోకి వెళితే..అచ్యుతాపురం గ్రామంలోని జాజుల శివన్నారాయణకు చెందిన పాడిగేదె బుధవారం గ్రామ శివారున ఉన్న పుష్కరకాలువలోకి నీటి కోసం దిగింది. ఈ క్రమంలో కాలువలో సాగునీటి కోసం అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారు వైర్లు తగిలి మృత్యువాత పడింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని రైతు తెలిపారు. గెదె మృతితో తమ జీవనోపాధి కోల్పోయామని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని రైతు శివన్నారాయణ కోరారు.

మహాలక్ష్మి అమ్మవారిని దర్శించిన ఎమ్మెల్యే



మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రామేశ్వరం గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందుకు ఆయనకు ఆలయం వద్ద గ్రామ సర్పంచి కొటికలపూడి చినబాబు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహించడం వల్ల ప్రతి ఒక్కరిలోను ఆధ్యాత్మిక భావాలు పెంపొందుతాయన్నారు. గత 30 ఏళ్లగా అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం చాలా అభినందనీయమని సర్పంచి కొటికలపూడి చినబాబు అతని బృందాన్ని, ఆలయ కమిటీ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఉప సర్పంచి కొటికలపూడి వరలక్ష్మి ఆలయాల కమిటీ చైర్మన్లు గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, కోలా లోవప్రసాద్, పార్టీ గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, మండల యూత్ లీడర్ కొటికలపూడి నాగవెంకట గణేష్, కొటికలపూడి గోపి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సంక్షేమానికి నిరంతర కృషి

- ఎన్‌పీఏ తగ్గింపునకు పటిష్ట చర్యలు
- ఆర్యాపురం బ్యాంకు చైర్ పర్సన్ రామకృష్ణ తులసి



మాట్లాడుతున్న చైర్ పర్సన్ రామకృష్ణ తులసి

రాజమహేంద్రవరం సిటీ: ఖాతాదారుల సంక్షేమానికి ది ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ పాలక వర్గం నిరంతరం కృషి చేస్తుందని చైర్ పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి అన్నారు. బ్యాంక్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ, బ్యాంకును అభివృద్ధిపథంలో కొనసాగించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్యాంకు ఏ గ్రేడ్ నుంచి క్రమంగా సీగ్రేడ్‌లోకి రావడానికి గత పాలకవర్గంలో చోటుచేసుకున్న పరిణామాలే కారణమన్నారు. బ్యాంక్ మెంబర్లకు గిఫ్ట్ కొనుగోలు కూడా ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న ఆనవాయితీయేనన్నారు. డిపాజిటర్లు, ఖాతాదారులు, సభ్యులను దృష్టిలో ఉంచుకుని బ్యాంకును మరింత అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో తమ పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. సెక్రటరీ (ఎఫ్ ఏసీ) కొండేటి స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ నెట్ ఎన్‌పీఏ ఆరుశాతం దిగువకు తగ్గించామని, మరింత తగ్గించడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. బ్యాంకులో సేల్ ఆఫీసర్‌ను నియమించామని త్వరలోనే వసూళ్లు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు మజ్జి నూకరత్నం, మార్గాని సురేష్, పెంకే సురేష్ కుమార్, వీణం వెంకటేశ్వర రావు (బిల్డర్ చిన్న), గొర్రిపాటి లీలా గంగాధరరావు (చిన్నబాబు), యర్రా ప్రసాదరావు, రాయుడు గణేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న పార్టీ మండల క్రిస్టియన్ మైనారిటీ కమిటీ ప్రతినిధులు

అనపర్తి: వైఎస్సార్ సీపీ పెదపూడి మండల క్రిస్టియన్ మైనారిటీ అనుబంధ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన సాంబత్తుల వీర వెంకటరమణ బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మైనారిటీ కమిటీ అధ్యక్ష పదివికి ఎంపిక చేసిందుకు గాను ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాలలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, పార్టీ పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, పార్టీ నాయకులు పేపకాయల వెంకటరమణ, కేతా శ్రీనివాస్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస్, హితకారిణి డైరెక్టర్ ఉండ్రు సత్యనారాయణ, గండ్రేడు సర్పంచ్ కురుపూడి శ్రీను, పెదపూడి ఎంపీటీసీ సమ్మంగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న గృహసారథులు, నాయకులు

రంగంపేట: ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తోందని గ్రామ సర్పంచ్ గవరసాని లక్ష్మీ దుర్గ అన్నారు. కోటపాడు గ్రామంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గహసారథులతో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను సేకరించారు. గోడలపై జగనన్న స్టిక్కర్లు అతికించారు. అనంతరం బ్రోచర్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుంకర అప్పారావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ గవరసాని రాజు, గుగ్గిల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో ప్రజా సమస్యల పరిష్కారం

- కలెక్టర్ మాధవీలత
- అధికారులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కారంలో నిబద్ధతతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని కలెక్టర్ మాధవీలత అన్నారు. జగనన్నకి చెబుదాం కార్యక్రమంపై ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య బుధవారం సాయంత్రం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపుతున్నామన్నారు. అయినా కొన్ని సందర్భాల్లో ప్రజలు పరిష్కారంపై సంతృప్తి వ్యక్తం చేయకపోవడంతో మరింత జవాబుదారీతనం చూపే దిశలో జేకేసీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. జిల్లాలో పనిచేసే ప్రతి జిల్లా అధికారి, ప్రతి వినతిని పరిష్కారమయ్యేవరకూ ట్రాక్ చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. జిల్లా, డివిజన్, మండల, మునిసిపల్, గ్రామ, వార్డు వరకూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టీఈఎం రాజు, జిల్లా పంచాయతీ అధికారి పి.జగదాంబ, కలెక్టరేట్ సాంకేతిక సహాయకులు సతీష్, సూపరింటెడెంట్ ఎం.మెరికమ్మ పాల్గొన్నారు.

వర్షాకాలానికి ముందే పూడికతీతలు



కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: వర్షాకాలం ప్రారంభానికి ముందే నగరంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు పూర్తికావాలని నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. స్థానిక 34, 35, 40, 41 డివిజన్లలోని సీతంపేట, మూలగొయ్యి, ఆర్యాపురం ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు కాలువల్లో చెత్త పేరుకుపోవడాన్ని గమనించారు. సిబ్బంది పనితీరు, అధికారుల పర్యవేక్షణపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయడం, వ్యాపార సంస్థలు, హోటళ్ల నుంచి వ్యర్థాలు ఎక్కువగా డ్రైనేజీల్లో కలుస్తున్నట్టు తెలుస్తోందన్నారు. అటువంటి వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ ఇంటి వద్ద చెత్తను డస్ట్‌బిన్లలో వేసి చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలన్నారు. మురుగు కాలువల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తనకు నివేదికలు అందజేయాలని శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్‌కు ఆదేశించారు. రాత్రివేళ వీధులను శుభ్రం చేస్తున్న స్వీపింగ్ యంత్రం పనితీరును పరిశీలించారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.వినూత్న తదితరులు పాల్గొన్నారు.